క్లుప్తంగా

బాలికల హాస్టల్లో న్యాయమూర్తి తనిఖీలు



కొవ్వూరులో ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థినులతో న్యాయమూర్తి శారదాంబ

కొవ్వూరు: పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని శనివారం సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.శారదాంబ తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థినుల సమస్యలు ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆహారం, తాగు నీరు, పరిసరాల శుభ్రత, మరుగుదొడ్లను పరిశీలించారు. హాస్టల్ వార్డెన్ శ్రీలత ఆమె వెంట ఉన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు కొవ్వూరు న్యాయ సేవాధికారకార సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామని న్యాయమూర్తి శారదాంబ తెలిపారు.

తెరచుకున్న సులభ్ కాంప్లెక్స్



కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో తెరచుకున్న సామూహిక మరుగుదొడ్లు

సాక్షి ఇంపాక్ట్

కొవ్వూరు: స్థానిక కోర్టు ప్రాంగణంలో మూసివేసిన సులభ్ కాంప్లెక్స్ (సామూహిక మరుగుదొడ్లు) ఎట్టకేలకు తెరచుకున్నాయి. దాదాపు గత మూడేళ్లగా వీటిని వినియోగించకుండా తాళాలు వేసి మూసి ఉంచారు. దీనిపై 'సులభ్ కాంప్లెక్స్.. తాళం తీస్తే ఒట్టు..?' అనే శీర్షికతో ఈనెల 23న సాక్షిలో వార్త ప్రచురితం అయిన విషయం తెలిసిందే. దాంతో అధికారులు స్పందించారు. కొవ్వూరు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో సామూహిక మరుగుదొడ్ల నిర్వహణకు ఒక వ్యక్తిని ఏర్పాటు చేశారు. ఇన్నాళ్లూ నిరుపయోగంగా మూసిఉన్న సామూహిక మరుగుదొడ్లు వినియోగంలోకి రావడంపై స్థానికులు, వివిధ పనులపై ఇక్కడకు వచ్చే వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొవ్వూరులో రైళ్లు నిలుపు చేయాలి



విదేశాంగ శాఖ సహాయ మంత్రి మురళీధరన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు: కరోనాలో కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఎత్తివేసిన రైళ్లకు తిరిగి హాల్ట్ ఇవ్వాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం రాజమహేంద్రవరం విచ్చేసిన కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎస్.మురళీధరన్‌ను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. కొవ్వూరు స్టేషన్‌లో రైళ్లను ఆపకపోవడంతో ఈ ప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దశల వారీగా రైళ్లను నిలుపుదల చేసేందుకు కృషి చేస్తామని కేంద్ర మంత్రి తమకు హామీ ఇచ్చారని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, కొవ్వూరు పట్టణశాఖ అధ్యక్షుడు బోడపాటి ముత్యాలరావు, నాయకులు బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, మట్లా వీరాంజనేయులు, తాడిమళ్ల విజయవాణి తదితరులు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా 'ముమ్మిడి'

దేవరపల్లి: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా దేవరపల్లి మండలం చిన్నాయగూడేనికి చెందిన ముమ్మిడి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నుంచి ముమ్మిడి నియామక పత్రం అందుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకుడిగా కొనసాగుతున్నారు.

సారా ముడి పదార్థాలు అమ్మితే చర్యలే..

రాజమహేంద్రవరం రూరల్: సారాయి తయారీకి ముడిపదార్థాలు అమ్మేవారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రమణ తెలిపారు. శనివారం ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో ఆయన నార్త్‌స్టేషన్ ఆవరణలో బెల్లపు వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పి.వి.రమణ మాట్లాడుతూ పేదలకు సారా అందుబాటులో ఉండకుండా దానిలో ఉపయోగించు బెల్లపు అమ్మకాలు–కొనుగోలుపై వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. ఈ విషయంలో ప్రభుత్వానికి సహకరించాలని ఇన్‌స్పెక్టర్ రమణ కోరారు.

లగ్గాలున్నా.. లాభాలు రావాయె

- ఒడుదొడుకుల్లో జీడిపప్పు వ్యాపారం
- తయారీకి గింజల కొరత
- కిలో పప్పు ధర రూ.580
- బస్తా గింజల ధర రూ.9600
- విదేశాల నుంచి దిగుమతి



దేవరపల్లిలో జీడిపప్పును గ్రేడింగ్ చేసి ప్యాకింగ్ చేస్తున్న మహిళలు



నల్లజర్ల మండలం దూబచర్లలోని ఓ ఫ్యాక్టరీలో జీడిగింజల నుంచి పప్పు తీస్తున్న కార్మికులు

దేవరపల్లి: జీడిపప్పు వ్యాపారం ఒడిదుడుకులతో కొనసాగుతోంది. వివాహ ముహూర్తాల సమయంలోను వ్యాపారం మందకొడిగా ఉందని వ్యాపారులు వాపోతున్నారు. పెళ్లిళ్ల సీజన్ మొదలయ్యాక జీడిపప్పు వినియోగం పెరిగి నాలుగు డబ్బులు వస్తాయని ఆశించారు. అయితే కొనుగోళ్లు అంతంత మాత్రంగా ఉండడంతో ఎగుమతులు తగ్గాయని వ్యాపారులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలోని దేవరపల్లి, తాడిమళ్ల, దూబచర్ల, గోపాలపురం మండలాల్లో జీడిపప్పు తయారీ కర్మాగారాలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో దాదాపు 15 సంవత్సరాలుగా జీడిపప్పు వ్యాపారం జరుగుతోంది. చిన్నా,పెద్ద కలిపి సుమారు 100 ఫ్యాక్టరీలు ఉన్నాయి. ప్రస్తుతం పప్పు తయారీకి గింజల కొరత ఏర్పడింది. స్వదేశీ గింజలు లేకపోవడంతో విదేశీ గింజలను దిగుమతి చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. ప్రస్తుతం జీడిమామిడి తోటలు పూత, పిందె దశలో ఉన్నాయి. మరో నెల తర్వాత కొత్త పంట రైతుల ఇంటికి చేరుతుంది. కొత్తపంట వస్తే గింజలు అందుబాటులోకి వస్తాయని వ్యాపారులు తెలిపారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలోని ఇసుక, ఎర్ర నేలల్లో జీడిమామిడి సాగు జరుగుతోంది.

కిలో గింజల ధర రూ.580

కిలో జీడిపప్పు ధర రూ.580 ఉంది. ఏడాదిగా ఇదే రేటు నిలకడగా ఉంది. జీడిగింజల ధర బస్తా (80 కిలోలు) రూ.9600 పలుకుతోంది. టాంజానియా, కొనైగిరి వంటి విదేశాల నుంచి జీడి గింజలను దిగుమతి చేస్తున్నారు. కేరళ గింజలు అందుబాటులో ఉన్నప్పటికీ బస్తా గింజల రేటు రూ.9600, టాంజానియా రూ.10,400, కొనైగిరి గింజలు రూ.7000 ధర ఉన్నాయి. ధర తక్కువగా ఉండడంతో వ్యాపారులంతా కొనైగిరి గింజలను కొనుగోలు చేసి పప్పు తయారు చేస్తున్నారు. అయితే కొనైగిరి గింజల లేకపోవడంతో కొరత ఏర్పడిందని వ్యాపారులు తెలిపారు. బస్తా గింజలతో 25 కిలోల పప్పు తయారవుతుందని వ్యాపారులు తెలిపారు. అయితే పప్పు నాణ్యత బాగుంటుందన్నారు. ఇక్కడ తయారు చేసిన జీడిపప్పును పట్టణ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, బందరు, కనిగిరి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

వ్యాపారాలు అంతంత మాత్రం



"జీడిపప్పు వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాల వంటి శుభమూహూర్తాలు ఉన్నప్పటికి పప్పు వినియోగం పెరగలేదు. దీనివల్ల ధర నిలకడగా ఉంది. కిలో పప్పు ధర రూ.580 ఉంది. ఈ రేటు గిట్టుబాటు కావడం లేదు. రూ.650 ఉంటే గిట్టుబాటు అవుతుంది. గింజల కొరత వల్ల ఫ్యాక్టరీలను నడప లేకపోతున్నాము. మరో నెల రోజులు గింజల కొరత ఉంటుంది. కొత్త పంట వస్తే గింజలు అందుబాటులో ఉంటాయి. ఇప్పటి వరకు కొనైగిరి గింజలు వ్యాపారులను కాపాడాయి. గింజల రేటు తక్కువ కావడం వల్ల పప్పు రేటు తగ్గినా పరిశ్రమలు నడపగలిగాం."
– పెంజర్ల గణేష్‌కుమార్, జీడిపప్పు వ్యాపారి, దేవరపల్లి

క్యాంపస్ ఇంటర్వ్యూలకు 32 మంది హాజరు

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. ఐసీఐసీఐ, డెక్కన్ కెమికల్స్ సంస్థల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశారన్నారు.100 పోస్టులకు గాను 32 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. వారిలో డెక్కన్ కెమికల్స్ సంస్థ ఒకరిని ఎంపిక చేసిందన్నారు. ఐసీఐసీఐ బ్యాంకు ప్రతినిధులు రెండు దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక గ్రామానికి చెందిన దూడల మంగతాయారు అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు మంజూరైంది. కాగా ఆ సొమ్మును శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యాళ్ల బాబురావు, వెల్ఫేర్ అసిస్టెంట్ కవిత చేతుల మీదుగా అందజేశారు.

రేపు కొవ్వూరు మునిసిపల్ సమావేశం

కొవ్వూరు: కొవ్వూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్ పర్సన్ భావన రత్న కుమారి తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై సమీక్షిస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఎప్పటి నుంచో శ్రీవారిని దర్శించాలనుకున్నా..

- అలనాటి సినీ హీరోయిన్ ఊహ



శ్రీవారి ఆలయ వీఐపీ లాంజ్‌లో ఊహ

ద్వారకాతిరుమల: చిన వెంకన్నను ఎప్పటి నుంచో దర్శించాలనుకున్నా.. అయితే ఇప్పటికి కుదిరిందని అలనాటి సినీ హీరోయిన్ ఊహ అన్నారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. తరువాత ఆలయ వీఐపీ లాంజ్‌లో స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఊహ మాట్లాడుతూ విజయవాడలో శుక్రవారం రాత్రి జరిగిన ఒక వివాహ వేడుకలో తాను పాల్గొన్నట్టు చెప్పారు. అయితే శ్రీవారిని దర్శించాలన్న కోరికతో మొదటి సారిగా ఇక్కడకు వచ్చినట్టు చెప్పారు. స్వామివారిని దర్శించడం తన అదృష్టమన్నారు.

మార్చి 3న విగ్రహాల ప్రతిష్ఠాపన



పెద్దేవంలో నిర్మించిన భారీ ఆంజనేయ స్వామి విగ్రహం

తాళ్లపూడి: పెద్దేవం గ్రామంలోని సాయిబాబా ఆలయ సమీపంలో తలపెట్టిన 27 అడుగుల భారీ ఆంజనేయ స్వామి వారి విగ్రహ నిర్మాణం పూర్తయ్యింది. మార్చి 3న విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని అభయాంజనేయ స్వామి ట్రస్ట్ సభ్యులు తెలిపారు. గ్రామస్తులు, దాతలు, భక్తుల ఆర్థిక సాయం రూ.10 లక్షల వ్యయంతో ఈ భారీ విగ్రహాన్ని నిర్మించినట్టు తెలిపారు. విగ్రహం వద్ద 7న ఏకాహం జరుగుతుందన్నారు.

కురుకూరులో..

దేవరపల్లి: మండలంలోని కురుకూరులో నిర్మించిన అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో మార్చి 3 ఉదయం 7.45 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. దాతల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. విగ్రహ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠాపనల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఉండ్రాజవరంలో విగ్రహాల ప్రతిష్ఠాపన

ఉండ్రాజవరం: రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో నూతనంగా నిర్మించిన వినాయక, రామాలయాల ప్రారంభోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో సీతారామ,లక్ష్మణ, ఆంజనేయస్వామి, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉండ్రాజవరంలో ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు



సమన్వయంతో గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

- ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు
- ప్రజా సమస్యలపై తాళ్లపూడి మండల పరిషత్ సమావేశంలో చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పోశిరాజు

తాళ్లపూడి: అధికారులు సమన్వయంతో పనిచేసి జగనన్న లే అవుట్లలో చేపట్టిన గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మండలాధ్యక్షుడు జొన్నకూటి పోశిరాజు సూచించారు. తాళ్లపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి నిర్వహించారు. ఎంపీడీవో ఎం.రాజశేఖర్‌తో కలసి వివిధ శాఖల పనితీరుపై సంబంధిత అధికారులతో ఎంపీపీ పోశిరాజు సమీక్షించారు. ఈ క్రమంలో గృహ నిర్మాణం, విద్యుత్తు, వ్యవసాయ, ఐసీడీఎస్, ఉపాధి హామీ, గ్రామీణ నీటి సరఫరా, ఆరోగ్యం, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమ శాఖల పురోగతి గురించి సమావేశానికి నివేదికలు సమర్పించారు.

సమస్యలుంటే మా దృష్టికి తీసుకురండి

ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సూర్జాన్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఎక్కడైనా తాగునీటి సమస్యలు తెలెత్తితే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. విద్యుత్ శాఖ ఏఈ వెంకటరావు మాట్లాడుతూ అన్నదేవరపేటలోని జగనన్న లేవుట్‌లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా స్తంభాలు వేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న గృహాలకు విద్యుత్తు మీటర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో ఎం.ప్రమోదకుమారి మాట్లాడుతూ మండలంలో 22 అంగన్‌వాడీ కేంద్రాల సొంత భవనాల నిర్మాణాలకు నిధులు మంజూర య్యాయన్నారు. వాటిలో 15 భవనాల నిర్మాణాలు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని తెలిపారు. మరో ఏడు భవనాల పనులు మొదలు కావాల్సి ఉందన్నారు. గజ్జరంలో నిర్మాణం పూర్తయిన అంగన్‌వాడీ భవనానికి బిల్లుల చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్ గండి రాంబాబు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. పైగా ఎం బుక్‌లు కూడా లేవని అధికారులు అనడం సరి కాదన్నారు. దీనిపై ఎంపీడీవో రాజశేఖర్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి బిల్లు చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య, ఏవో జి రుచిత, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వీరన్న, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థుల ప్రతిభా పాటవాలకు అవధుల్లేవని వారు కొనియాడారు. ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రూబీ, కరస్పాండెంట్ సిస్టర్ తవితలు ప్రారంభించారు.

జాతీయ ఉత్తమ రైతు 'ముప్పన'కు సత్కారం



జాతీయ ఉత్తమ రైతు రమణారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

గోపాలపురం: జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత ముప్పన రమణారెడ్డిని శనివారం స్థానిక శర్వాణి హైస్కూల్ ఆవరణలో ఘనంగా సత్కరించారు. జీడిమామిడి సాగుపై ఇటీవల భువనేశ్వర్‌లో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో రమణారెడ్డి జాతీయ ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. ఆయనకు శర్వాణి హైస్కూల్ అధినేత డాక్టర్ బొమ్మారెడ్డి గంగాధరరెడ్డి, ముప్పిడి సుబ్బారెడ్డి, స్కూల్ యాజమాన్యం మాకిరెడ్డి శ్రీహరినాథ్ రెడ్డి, బాజ్జి, ప్రిన్సిపాల్ ఫణికిషోర్, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వుండవల్లి సుభాష్‌చంద్రబోస్, స్థానిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ ఎస్‌కే ఖాదర్‌వల్లీ, జేష్ట బుల్లిఅబ్బులు, గోపాలపురం, దేవరపల్లి మండలాల ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్తు సరఫరా వేళల్లో మార్పు

దేవరపల్లి: స్థానిక విద్యుత్తు సెక్షన్ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి, రామన్నపాలెం, గౌరీపట్నం, పల్లంట్ల సబ్‌స్టేషన్ల పరిధిలోని వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు సరఫరా వేళ్లల్లో మార్పు చేసినట్టు ఈఈ బి.వీరభద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు గ్రూపుల్లో విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. మారిన వేళ్లలు ఆదివారం నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు. ఎ-గ్రూపునకు ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు, ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. ఎ గ్రూపులో గొల్లగూడెం, బందపురం, రామన్నపాలెం, బుచ్చియపాలెం, దుద్దుకూరు, పల్లంట్ల గ్రామాలు ఉన్నాయని చెప్పారు. ఇక బి- గ్రూపునకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. బి గ్రూపులో అచ్చయపాలెం, దేవరపల్లి, గౌరీపట్నం, లక్ష్మీపురం, చిక్కాల గ్రామాలు ఉన్నాయన్నారు.

నేడు దేవరపల్లిలో కంటి వైద్య శిబిరం

దేవరపల్లి: స్థానిక షిర్డీ సాయి మందిరం వద్ద ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు షిర్డీసాయి సేవా సమాజ్ నిర్వాహకులు శనివారం తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన రోగులకు కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. వైద్య పరీక్షలకు హాజరయ్యే రోగులు తప్పని సరిగా ఆధార్ కార్డు తెచ్చుకోవాలన్నారు.

మేలు జాతి పశువులను అభివృద్ధి చేయాలి

- పశుసంవర్ధకశాఖ జేడీ సత్య గోవింద్
- తెలికిచెర్లలో లేగ దూడల అందాల పోటీలు



అందాల పోటీలకు హాజరైన లేగ దూడలను పరిశీలిస్తున్న పశుసంవర్థక శాఖ అధికారులు

నల్లజర్ల: ఎలాంటి వాతావరణాన్ని అయినా తట్టుకుని పెరిగే మేలురకం పశువులను అభివృద్ధి చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ సత్యగోవింద్ రైతులకు సూచించారు. నల్లజర్ల మండలం తెలికిచెర్లలో శనివారం లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యగోవింద్ మాట్లాడుతూ పశువు ఏజాతిది అయినప్పటికీ దాణా ఖర్చు ఒక్కటే అన్నారు. అలాంటపుడు మేలు జాతి పశువులను అభివృద్ధి చేసుకోవడం శ్రేయస్కరమన్నారు. పశుపోషకులకు ప్రభుత్వ ప్రోత్సాహం బాగా ఉందన్నారు. లేగదూడల పోటీలు నిర్వహించడం ద్వారా రైతుల్లో పోటీతత్వం ఏర్పడుతుందన్నారు. ప్రతి రైతుభరోసా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు అందుబాటులో ఉంటున్నారని, వారి సేవలు వినియోగించుకోవాలన్నారు. పశు అంబులెన్స్ 1962 సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి శాఖ అధికారి డాక్టరు ఏసురత్నం, నల్లజర్ల ఏడీ మెజెస్ వెస్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ బహుమతి: ముర్రా జాతి
1.బయ్యా వెంకటేశ్వర రావు
2.పదిలం శ్రీనివాస్

ఆవు దూడలు..
1.చింతా సుబ్రహ్మణ్యం
2.తోట వరప్రసాద్
3.ఎస్‌కే షరీఫ్

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



రక్షణ కల్పించాలంటూ ఎస్ఐ నరసింహమూర్తికి కోరుతున్న చేస్తున్న ప్రేమ జంట

నల్లజర్ల: తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఓ ప్రేమజంట శనివారం నల్లజర్ల పోలీసులను ఆశ్రయించింది. కృష్ణా జిల్లా మచిలీపట్నం సమీపంలోని గూడూరుకు చెందిన సంకుల గాయత్రి బీఎస్సీ పూర్తి చేసి మంగళగిరిలోని ఓ కంప్యూటర్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కాటకోటేశ్వరానికి చెందిన కాజ గణపతి నల్లజర్ల మండలం అనంతపల్లిలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. వారిద్దరూ ఫేస్‌బుక్‌లో స్నేహితులు. ఒకరినొకరు ఇష్టపడ్డారు. రెండున్నరేళ్లగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలు గాయత్రికి బయట సంబంధాలు చూస్తున్నారు. కులాలు వేరు కావడంతో పెద్దలు అంగీకరించరేమోనని భావించి వారిద్దరూ శనివారం అన్నవరం సత్యనారాయణ స్వామి గుడిలో వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన గాయత్రి తరపు పెద్దలు మండిపడి చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో తమకు రక్షణ కల్పించాలంటూ గాయత్రి నల్లజర్ల ఎస్ఐ నరసింహమూర్తికి శనివారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఆదివారం ఇరువురి పెద్దలను పిలిచి మాట్లాడతామని ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

బాలికను మోసగించిన యువకుడి అరెస్టు

నిడదవోలు రూరల్: మాయమాటలతో వంచించి బాలికను గర్భవతిని చేసిన యువకుడిని పోక్సో చట్టం కింద శనివారం అరెస్టు చేసినట్టు ఎస్సై షేక్‌సుభాని తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన 16 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ ప్రత్తి కిరణ్ అనే యువకుడు ప్రేమించానని నమ్మించాడు. గర్భవతిని చేశాడు. ఇటీవల బాధిత బాలిక నిడదవోలులోని ఓ ప్రైవేటు కళాశాలలో బాత్‌రూమ్‌కు వెళ్లిన సందర్భంలో ప్రసవించిన సంగతి తెలిసిందే. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ యువకుడిని అరెస్టు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

కోడి పందేలు ఆడుతున్న 10 మంది అరెస్టు

నల్లజర్ల: మండలంలోని తెలికిచెర్ల గొర్లగుంట ప్రాంతంలో శనివారం సాయంత్రం నిర్వహిస్తున్న కోడి పందేలపై నల్లజర్ల పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా వారు 10 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి19 బైక్‌లు, నాలుగు కోడిపుంజులు, రూ.3,300 నగదు స్వాధీనం చేసుకొన్నట్టు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు. ఈ కోడి పందేల్లో దెందులూరుకు చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే కూడా ఒకరు పాల్గొన్నట్టు చెబుతున్నారు.

ప్రకటన

నా క్లయింటు శ్రీ కాళ్ల సత్యనారాయణ తండ్రి వెంకట్రావు, వాడపల్లి, కొవ్వూరు మండలం, తూ।।గో।। జిల్లా నాకు ఇచ్చిన సంజాయిషీ పై పబ్లిక్ ప్రకటన జారీ చేయడమైనది.

నా క్లయింటు వాడపల్లి గ్రామ కాపురస్తులు అయివున్నారు. నా క్లయింటు తండ్రి గారైన కాళ్ల వెంకట్రావు గారు నా క్లయింటు పేర కొంత ఆస్తి గిఫ్ట్ ఇచ్చి సెటిల్‌మెంటు దస్తావేజు నెం.2697/2005 ది.20.08.2005 తేదిన ద్వారా కొవ్వూరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ చేసియున్నారు. ది.20.02.2023 తేదిన కాళ్ల సత్యనారాయణ గారు ఒరిజినల్ సెటిల్‌మెంటు దస్తావేజు డాక్యుమెంట్ నెం. 2697/2005 ది.20.08.2005 మరియు ఇతర కాగితములు జిరాక్సులు తీయించు నిమిత్తం వాడపల్లి నుండి కొవ్వూరు జిరాక్స్ షాపుకు తన బుల్లెట్ వాహనముపై వెళ్ళుచుండగా కొవ్వూరు తాలూకా షాపు దగ్గరకు వెళ్ళుచుండగా ఒరిజినల్ సెటిల్‌మెంటు దస్తావేజు డాక్యుమెంట్ నెం. 2697/2005 మరియు ఇతర కాగితములు గల కాపదు కనిపించ లేదు. నా క్లయింటు వచ్చిన దోవలో అన్ని ప్రాంతాల లలో వెతికినను ఎక్కడా కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినను ఎక్కడా దొరకలేదు. నా క్లయింటు ఒరిజినల్ సెటిల్‌మెంటు దస్తావేజు డాక్యుమెంట్ నెం. 2697/2005 ది.20.08.2005 మరియు ఇతర కాగితముల కవరు ఎవరికైనా లభించిన లేదా దొరికిన, సదరు ఒరిజినల్ సెటిల్‌మెంటు దస్తావేజు నెం. 2697/2005 ది. 20.08.2005 మరియు కాగితము కవరు నాకు గాని నా క్లయింటు కాళ్ల సత్యనారాయణ తండ్రి వెంకట్రావు వాడపల్లి వారికి అప్పచెప్పవలసినదిగా కోరుతు పబ్లిక్ నోటీస్ జారీ చేయడమైనది.

కొవ్వూరు — యాకుబ్ మోహమ్మద్
తేది.23.02.2023 — అడ్వకేట్

బాలలతోనే సమాజాభివృద్ధి



బాలోత్సవంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి

ప్రకాశం నగర్: బాలలతోనే సమాజభివృద్ధి సాధ్యం, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి సమాజానికి అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో 'గోదావరి బాలోత్సవాలు' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా జాతీయ పతాకాన్ని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఆవిష్కరించగా, గోదావరి బాలోత్సవం పతాకాన్ని చిన్నారుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో బాలోత్సవం మొదటి పిల్లల పండుగను నిర్వహించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఒక్కటే కాదని, అన్ని అంశాలపైనా అవగాహన అవసరమన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అవసరమైన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా బాలలు చేసిన పలు సంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్నికి సీనియర్ జర్నలిస్టు వీవీఎస్ కృష్ణకుమార్ అధ్యక్షత వహించగా, పీపీ రాజబాబు, ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, అలపాటి నాగేశ్వరరావు, తలారి వాసు, చైతన్య శేఖర్, పి.తులసి, తాడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com